# ప్రజల మౌలిక సమస్యలతో సంబంధంలేని 'ప్రత్యేకహోదా'ను మరోసారి ఎజెండా చేస్తోన్న పాలకులు

**కాలచక్రం** ఎన్నికలకు దగ్గరవుతూంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలకపార్టీలు అధికారంకోసం అర్రులు చాస్తూ, ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ, రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని మరింత దిగజారుస్తున్నాయి. ప్రజల మౌలిక సమస్యలను ప్రక్కకు మళ్ళిస్తూ, సాధ్యమైనంత ఎక్కువకాలం వాయిదావేస్తూ రావటంలో ఈ పార్టీలన్నిటి నడుమ ఏకీభావం వుంది.

ఆంధ్రప్రదేశ్ విభజనచట్టం - 2014లోని అంశాలన్నింటినీ సాధిస్తామని, ప్రత్యేకహోదా తెస్తామనీ రాష్ట్రంలోని తెలుగుదేశం పాలకులూ, ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేకహోదా కల్పిస్తామని బిజెపి నాయకులూ ఊదర గొట్టారు. పార్లమెంటులో విభజన చట్టంపై చర్చ సందర్భంగా ఏ.పి.కి ఐదు సం॥లు ప్రత్యేకహోదా కల్పిస్తామని నాటి ప్రధాని హామీ ఇస్తే, 'కాదు.... పది సం॥లు ప్రత్యేకహోదా కావాల్సిందేన'ని బిజెపి నేతలు డిమాండ్ చేశారు. వారి ఎన్నికల ప్రణాళికలో హామీగా ఆ అంశాన్ని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా అంటే ఏమిటో విడమర్చి వివరించకుండా, దానినొక 'బ్రహ్మపదార్థం'గా చేసి, భావోద్వేగాల అంశంగా మార్చారు.

కొన్ని వెనుకబడిన ప్రాంతాలను త్వరితంగా అభివృద్ధిచేసే లక్ష్యంతో - జనాభా, తలసరి ఆదాయం, ఆయా రాష్ట్రాల ప్రత్యేక సమస్యలను పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రణాళికా సంఘం ప్రత్యేకహోదా కల్పించే రాష్ట్రాలను నిర్ణయించేది. నాల్గవ పంచవర్ష ప్రణాళిక కాలంలో అస్సాం, నాగాలాండ్, జమ్ము-కాశ్మీర్ రాష్ట్రాలకు ప్రత్యేకహోదా కల్పించారు. ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలంనాటికి ఈశాన్య భారతంలోని ఏడు రాష్ట్రాలకు, సిక్కిం, హిమాచలప్రదేశ్‌లకు ప్రత్యేకహోదానిచ్చారు.

పంచవర్ష ప్రణాళికద్వారా మొత్తంగా రాష్ట్రాలకు కేటాయించే నిధులలో ప్రత్యేకహోదా పొందిన రాష్ట్రాలకు 30 శాతం నిధులు లభిస్తాయి. ప్రణాళికా సంఘం ఇచ్చే ఈ నిధులలో 30 శాతం (తిరిగి చెల్లించనవసరంలేని) గ్రాంటుగానూ, 70 శాతం రుణంగానూ వుంటుంది. కాగా, 2001 నుండీ పదేళ్ళపాటు ఆదాయపన్ను, కేంద్ర ఎక్సైజు పన్నులను ప్రత్యేకహోదా రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం వందశాతం మినహాయింపు నిచ్చింది. ఇది - ప్రత్యేహోదాతో ఆటోమాటిక్‌గా వచ్చేదికాదు; కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయమే!

బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రణాళికాసంఘాన్ని రద్దుచేసి, దాని స్థానంలో 'నీతి ఆయోగ్'ను ఏర్పరిచింది. కనుక, ప్రత్యేక హోదా పొందిన రాష్ట్రాలకు ఇక ప్రణాళికా సంఘం నిధులు కేటాయించట మనేది వుండదు; దాని స్థానంలో ఏర్పాటైన నీతి ఆయోగ్ విధి విధానాలు ఎలా వున్నాయో స్పష్టతలేదు. అయితే నీతి ఆయోగ్ రాష్ట్ర ప్రణాళికలకు నిధులు కేటాయించే పనిచేయదనేది స్పష్టం. కేంద్రం నూతనంగా ప్రవేశపెట్టిన నూతన పన్నుల విధానం జిఎస్‌టితో రాష్ట్రాల ఆదాయంలో అధికభాగం కేంద్రం వద్దే పోగుపడుతుంది. ఏమైనా 14వ ఆర్థిక సంఘం కేంద్ర నిధుల నుండి రాష్ట్రాలకు పంపకం చేయాల్సిన భాగాన్ని 32 నుండి 42 శాతానికి పెంచింది. ఇకపై ఏ రాష్ట్రానికీ ప్రత్యేకహోదా ఇవ్వవద్దని 14వ ఆర్థిక సంఘం సిఫార్స్ చేసినట్లుగా బూటకపు ప్రచారాన్ని బిజెపి, టిడిపిలు చేశాయి. ప్రత్యేక ప్యాకేజీతో 'ప్రత్యేకహోదా'కు మించిన లబ్ధిని రాష్ట్రానికి చేకూరుస్తామని ప్రజలను నమ్మింపజూశాయి.

బిజెపితో చెలిమిలో వున్న రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం విభజన చట్టంలోని పథకాలను, బిజెపి ఎన్నికల హామీలను కేంద్రం మెడలు వంచి అమలు చేయించే ప్రయత్నం చేయలేదు. తానుగా ప్రజా రాజధాని నిర్మాణం పేరిట ముక్కారు పంటలు పండే 33 వేల ఎకరాల మంగళగిరి ప్రాంత రైతుల భూములను అదిరింపులు, బెదిరింపులతో గుంజుకుంది. ప్రపంచస్థాయి రాజధాని అంటూ గ్రాఫిక్స్ మాయాజాలంతో ప్రజలను వంచనకు గురిచేస్తోంది. రాజధాని నిర్మాణం కోసమేగాక పోర్టులు, విమానాశ్రయాలు, పార్కులు, భారీ రహదారులు, ప్రాజెక్టులు తదితర నిర్మాణాలపేరిట రాష్ట్రవ్యాపితంగా ప్రజలనుండి బలవంతంగా పెద్దఎత్తున భూములను సేకరించటం వల్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో నున్నారు. రైతాంగ రుణమాఫీని 50 వేల రూ॥కు పరిమితం చేసి, అదికూడా ఈనాటికీ పూర్తిగా మాఫీచేయకపోవటం రైతులలో తీవ్ర అసంతృప్తిని కలిగించింది. ఒకవైపు అప్పు రద్దుకాక, మరోవైపు అప్పు చెల్లించలేదనే కారణంతో బ్యాంకులు అందించే కనీసపాటి రుణసౌకర్యానికి కూడా అనర్హులై, రైతాంగం తీవ్ర అవస్థలనెదుర్కొన్నారు. ఇక చేనేత, డ్వాక్రా రుణాల రద్దు తతంగం కూడా ఈ కోవలోకే చేరింది. కాంట్రాక్టు కార్మికులు, అధ్యాపకులు, అంగన్‌వాడీలు, మొదలుకొని వివిధ సెక్షన్ల ఉద్యోగులకు, కార్మికుల కిచ్చిన ఏ హామీని అమలుచేయకుండా బిజెపికి వలెనే తెలుగుదేశం ప్రభుత్వం కూడా దాట వేసింది. వీనికి తోడు కరవు, గిట్టుబాటుధరలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఉపాధి కొరత వంటి సమస్యలతో అన్ని సెక్షన్ల ప్రజానీకం వివిధ రూపాల్లో తమ నిరసనను, అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వస్తున్నారు.

ప్రతి సోమవారాన్ని 'పోల'వారంగా, పోలవరంపై ప్రత్యేక శ్రద్ధతో 2018నాటికే నిర్మాణం పూర్తిచేస్తామని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను, రైతాంగాన్ని మోసం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ బాధ్యతగా విభజన చట్టంలో పేర్కొన్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొంది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం ఏదో మేరకు కోటాయించిన నిధులను

పట్టిసీమ తదితర ప్రాజెక్టులకు మళ్ళించి (పోలవరం పూర్తికాదని ఎటూ తెలుసు కనుక!) గోదావరిని కృష్ణానదితో అనుసంధానం చేసిన అపర భగీరధుడిగా ముఖ్యమంత్రి తెలుగుదేశం శ్రేణుల నుండి స్తోత్ర పాఠాలందుకున్నాడు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం కేటాయించిన నిధులు, వాటి ఖర్చులకు సంబంధించిన సరైన సమాచారాన్ని ఇరువైపుల నుండీ పారదర్శకంగా వెల్లడి చేయకుండా ప్రజలను గందరగోళ పరుస్తున్నారు. నానాటికీ పెరుగుతున్న నిర్మాణ వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణ ఖర్చును పెంచి చూపటంతోపాటు వాటిలో వాటాకోసం వెంపర్లాడు తున్నారు. బడా పారిశ్రామిక అవసరాలకోసం, ఆ పరిశ్రమలకు అవసరమైన విద్యుదుత్పాదన కోసం, జలరవాణా సౌకర్యాలకోసం ఉద్దేశించిన పోలవరం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రజల పాలిట కల్పతరువుగా చిత్రించారు. ప్రాజెక్టు నిర్మాణంలో ముఖ్యమైన భూసేకరణ అంశంలో ముంపుకు గురయ్యే వేలాది గిరిజన గ్రామాలకు సమగ్ర, శాస్త్రీయ పునరావాసం అమలుచేయకుండా అదిరింపు, బెదిరింపులతో, బలప్రయోగంతో ఖాళీ చేయించటంపట్ల వారంతా తీవ్ర వ్యతిరేకతతోనున్నారు.

పైన పేర్కొన్న వివిధ కారణాలుగా ప్రజలలో గూడుకట్టుకుంటున్న ఈ అసంతృప్తి, ఆగ్రహాలను ప్రక్కకు మళ్ళించటం ద్వారా, రాబోయే ఎన్నికలలో రాజకీయంగా తాను లబ్ధిపొందగలుగుతానని తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. గత నాలుగేండ్లుగా కేంద్రంతో సర్దుకుపోవాలంటూ, ప్రత్యేకహోదా 'సంజీవని' కాదని, అంతకుమించిన ప్యాకేజీని సాధించుకున్నామంటూ ఊదరగొట్టిన తెలుగుదేశం పార్టీ, ఒక్కసారిగా స్వరం మార్చింది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులలో అన్యాయం జరిగిందని బాహాటంగా ప్రకటించటంతోపాటుగా, ప్రత్యేకహోదా కల్పించకుండా కేంద్రం 'తెలుగు ప్రజల'ను మోసగించిందని భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమ రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకోవాలని వ్యూహరచన చేస్తున్న బిజెపి నాయకులు గత నాలుగేళ్ళుగా మిన్నకుండి, నేడే కనుగొన్నట్లుగా తెలుగుదేశం ప్రభుత్వ వైఫల్యాలపై గొంతెత్తారు. విభజన జరిగి ఇబ్బందులలో వున్న రాష్ట్రానికి ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం అవసరమా అని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులను సక్రమంగా వినియోగించలేదని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. కేంద్ర పథకాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా చెప్పుకోవటంతోపాటు, కేంద్రం విడుదలచేసిన నిధులకు లెక్కలు కూడా చూపలేదని పేర్కొంటూ, ఎదురు ఆరోపణలు చేస్తున్నారు. పది సం॥ల కాలం హైదరాబాద్ రాజధానిగా పరిపాలన సాగించగలిగీ, రాజధాని నిర్మాణానికి ఎందుకు తొందరపడ్డారని నిలదీస్తున్నారు. ఇంత దుమ్మెత్తిపోసుకుంటూ కేంద్రంలో, రాష్ట్రంలో రెండు పార్టీలూ ఇంకా మిత్రకూటమిగానే కొనసాగుతున్నామని ప్రజలను నమ్మమంటున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం తన స్వీయ వైఫల్యాలన్నింటినీ కేంద్రప్రభుత్వం పైకి తోసివేయజూస్తోందని, బిజెపి మాత్రం విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉదారంగా ఎంతో ప్రయోజనం చేకూర్చిందని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. తద్వారా రాష్ట్రంలో తమ రాజకీయ పరపతి పెంపుకు ప్రయాస పడుతున్నారు.

ooooo